క్లుప్తంగా

అనాథ ఆశ్రమంలో ఎన్‌సీసీ డే



ఆశ్రమంలోని పిల్లలతో ఎన్‌సీసీ కేడెట్‌లు

గోదావరిఖనిటౌన్: నగరంలోని సెక్రెట్ హార్ట్ పాఠశాల విద్యార్థులు ఆదివారం ఎన్‌సీసీ డే సందర్భంగా గాంధీనగర్‌లోని ఎండీహెచ్‌డ బ్ల్యూఎస్ అనాథ ఆశ్రమంలోని పిల్లల మధ్య ఎన్‌సీసీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకులను ఆశ్రమంలోని పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లవీ జాకబ్, ప్రిన్సిపాల్ జ్యోత్స్న, ప్రైమరీ ఇన్‌చార్జి ఇన్నమ్మ, ఎన్‌సీసీ కేడెట్‌లు పాల్గొన్నారు.

కల్వచర్లలో మద్యం షాపు ఏర్పాటు చేయొద్దు

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామంలో ఏర్పాటు చేస్తున్న నూతన వైన్ షాపును ఏర్పాటు చేయొద్దని శనివారం కలెక్టర్, జిల్లా అబ్కారిశాఖ అధికారులకు కల్వచర్ల గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మెయిన్‌రోడ్‌పై ఉండడంతో పాటు మహిళలు, చిన్న పిల్లలకు ఇబ్బందులు తలెత్తనున్నాయని పేర్కొన్నారు. సమీపంలో శ్రీకృష్ణుని ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వెంటనే అక్కడి నుంచి వైన్‌షాపు తీసివేయాలని గ్రామస్తులు వినతి పత్రంలో కోరారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద పులిపాక చంద్రయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. కాగా తెలుసుకున్న నేనున్నా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ 50కేజీల బియ్యాన్ని పంపించగా సభ్యుడు పల్లె సురేశ్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తొగరు శ్రీనివాస్, శాంతన్ రెడ్డి, పూరెల్ల గంగయ్య, లక్ష్మన్, అంజయ్య, సాగర్ ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తులు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వైకుంఠ చతుర్దశి సందర్భంగా దాత్రి నారాయణస్వామి (ఉసిరి చెట్టు) కింద వైకుంఠ వత్తిని భక్తులు వెలిగించారు. అనంతరం సాలగ్రహ దానం, కూష్మాండ దానం, వస్త్రదానం, దీపదానం, పూజారుల భోజనానికి బియ్యం, సామగ్రి దానం చేశారు. అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను పూజారులు మహేశ్, రమేశ్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, అల్లంకి సత్యనారాయణ, భాగ్యలక్ష్మి దంపతులతో పాటు ఆలయ భక్త బృందం, మహిళలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి గ్రామానికి చెందిన పెనుకుల భూమయ్య (42) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్సై కృష్ణ తెలిపారు. మూడు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మద్యం సేవించిన అనంతరం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కాగా ప్రైవేట్ వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పెనుకుల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కల్లు దుకాణంలో యువకుడు మృతి



మృతి చెందిన సురేశ్

గోదావరిఖని: నగరంలోని ఫైవింక్లయిన్ చౌరస్తా సమీపంలోని కల్లు దుకాణంలో ఆదివారం సింగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సురేశ్ అనే యువకుడు మృతి చెందాడు. కొద్దిసేపు దుకాణం ఆవరణలోని గద్దెపై కూర్చున్న సురేశ్ అక్కడే మృతి చెందాడు. మృతి చెందిన తీరుపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, మృతదేహాన్ని మార్చురీకి తరలించామని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పేర్కొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

- ఎన్నికల బందోబస్తుపై పోలీసుల కవాతు



రామగిరి: సెంటినరీకాలనీలో..



సుల్తానాబాద్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



యైటింక్లయిన్‌కాలనీ: టూటౌన్ పోలీసులు



జూలపల్లి: మండల కేంద్రంలో..

యైటింక్లయిన్‌కాలనీ: ఈనెల 30న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోదావరిఖని టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం యైటింక్లయిన్‌కాలనీలో పోలీసులు కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ నుంచి బయలుదేరిన కవాత్ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియా మీదుగా, తెలంగాణ చౌరస్తా నుంచి, షిర్కే బస్‌స్టాప్ వరకు కాలనీ పురవీధుల గుండా నిర్వహించారు. అనంతరం టూటౌన్ సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీసుల విధులకు ఎలాంటి ఆటంకం కలిగించినా.. వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్, కమాన్‌పూర్ ఎస్సై రాములు, పోలీస్ సిబ్బంది, బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా వినియోగించుకోవడం, చైతన్యం కల్పించేందుకు పోలీసులు, కేంద్ర బలగాలతో ఆదివారం సుల్తానాబాద్‌లో కవాతు నిర్వహించారు. ప్రజలు తమ ఓటుహక్కును ఎలాంటి ప్రలోబాలకు లొంగకుండా, ఎవరైనా బెదిరింపులకు గురి చేయకుండా ఉండేందుకు ప్రజల్లో ధైర్యం నింపేందుకే ఈ కవాతు నిర్వహించామని సీఐ జగదీష్ అన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు విజేందర్, వినీత, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రామగిరి మండలంలో..

రామగిరి: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఆదివారం రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు మంథని సీఐ సతీశ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీసుల నియమ నిబంధనలు, సూచనలు పాటిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామగిరి, మంథని, ముత్తారం ఎస్సైలు కటికె రవి ప్రసాద్, పురుషోత్తం దివ్య, కిరణ్, రాణి, ఆది మధుసూదన్‌రావు, కేంద్ర సాయుధ బలగాల సిబ్బంది, రామగిరి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పోలీసు దళం కవాతు

జూలపల్లి/ఎలిగేడు: ఎన్నికల నిర్వహణ బందోబస్తుకు వచ్చిన జార్ఖండ్ ప్రత్యేక పోలీసు దళం జూలపల్లి, ఎలిగేడు మండల కేంద్రాల్లో ప్రధాన రహదారి వెంట కవాతు నిర్వహించారు. సుల్తానాబాద్ సీఐ కె.జగదీష్, ఎస్సైలు వెంకటకృష్ణ, విజయేందర్, అశోక్‌రెడ్డి, వినీత, సిబ్బంది ఉన్నారు.

ఓదెలలో రాజ్యాంగ దినోత్సవం



ఓదెల: నివాళి అర్పిస్తున్న నాయకులు

ఓదెల: మండలంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మాటూరి రత్నం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మండలంలోని కొలనూర్, ఓదెల, పొత్కపల్లి గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ మోదుంపల్లి సంపత్, బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ పూరెల్ల స్వప్నగౌడ్, ఎంపీటీసీ కారెంగుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సామ శంకర్, నాయకులు దొడ్డె శంకర్, సాత్తూరి అనిల్, మాటూరి ఉపేందర్, పల్లె ప్రశాంత్, మధు, మాటూరి నర్సయ్య, జీదుల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి మండల కేంద్రంలో..

జూలపల్లి: మండల కేంద్రంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండు వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మామిడిపెల్లి చంద్రశేఖర్, అబ్బాపూర్ ఎంపీటీసీ దండె వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, నాయకులు రాంగోపాల్‌రెడ్డి, అమరగాని ప్రదీప్‌కుమార్, ఎదుల్ల కనుకయ్య, మానుమండ్ల శ్రీనివాస్, కోరెపు సంపత్, వడ్లూరి తిరుపతి, చంద్రయ్య, చింతమల్ల వీరయ్య, తేజ్‌రాజ్ తదితరులు ఉన్నారు.




మురికినీటి నిల్వలు లేకుండా చూడండి

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ రాజీవ్ రహదారి పక్కన ఉన్న కెనాల్‌లో మురికినీటి నిల్వలతో దోమలు పెరిగి విషజ్వరాలు బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కాలువలో నీటి నిల్వ లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.

మండలంలో జోరుగా జీరో దందా!

- తెల్ల కాగితాలపై బిల్లులు రాసిస్తున్న వైనం
- అధికారుల పర్యవేక్షణ కరువు



సెంటినరీకాలనీ ఆటో స్టోర్‌లో తెల్ల కాగితంపై రాసిచ్చిన బిల్లు

రామగిరి: మండలంలో జీరో దందా యథేచ్ఛగా సాగుతోంది. అధికారుల అలసత్వం కారణంగా ఈ దందా రోజురోజుకూ విస్తరిస్తోంది. జీఎస్టీ ఏర్పాటు తర్వాత కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు పనిలేకుండా పోయింది. మండలంలో వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి, నిబంధనలు ఎలా అమలవుతున్నాయి, ప్రభుత్వానికి సక్రమంగా ట్యాక్స్ చెల్లింపులు జరుగుతున్నాయా లేదా అనే విషయంపై అధికారులు దృష్టి సారించడం లేదు. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా తీసుకున్న కొందరు వ్యాపారులు జీరో దందాకు తెరలేపారని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాల్సిన నిఘా వ్యవస్థ నిద్ర పోతుండడంతో రామగిరి మండలంలో జీరో దందా జోరుగా సాగుతోందని స్థానిక ప్రజలు అంటున్నారు. పలువురు వ్యాపారులు రూ.లక్షల లావాదేవీలను సైతం తెల్ల కాగితాలపై నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. విషయం తెలుసుకున్నా.. సంబంధిత శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధానాన్ని అమలు చేస్తోంది. మండల కేంద్రంలో దుస్తులు, బంగారం, స్టీల్, సిమెంట్, ఆటో స్టోర్స్, కిరాణా దుకాణదారులు బిల్లులు ఇవ్వడం లేదని సమాచారం. వినియోగదారుడు అడిగితే తప్ప ఇవ్వడం లేదని, అడగకుంటే తెల్ల కాగితంపై రాసి ఇస్తున్నారని తెలిసింది. తెల్ల కాగితంపై తీసుకున్న వస్తువుల పేర్లు, దుకాణం పేరు, టీఓటీ, వ్యాట్ రిజిస్టర్ నంబర్లు కనిపించవు. బిల్లులు ఇస్తే ట్యాక్స్‌తో వస్తువుల ధర పెరుగుతుందని కొనుగోలుదారులకు చెప్తుండడంతో వారు కూడా అడగడం లేదని తెలుస్తోంది.

తెల్ల కాగితమే బిల్లు..

ప్రతి ఏడాది రూ.20 లక్షల కంటే ఎక్కువ వ్యాపారం జరిగితే తప్పక జీఎస్టీ లైసెన్స్‌ను వ్యాపారి తీసుకోవాలి. విక్రయించిన ప్రతి వస్తువుకు బిల్లును వినియోగదారుడికి అందించాలి. ఆ బిల్లుపై జీఎస్టీ నంబర్, బిల్‌పై వరుస సంఖ్య ఉండాలి. బిల్లును కార్బన్ పేపర్ పెట్టి రాయాలి. ఒరిజినల్ బిల్లు వినియోగదారుడికి, మరో బిల్లు షాపులో బిల్లు బుక్‌తోనే ఉండాలి. కానీ అలాంటివి ఏమీ లేకుండా కేవలం తెల్ల కాగితమే ప్రామాణికంగా బిల్లులు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పన్నుల ఎగివేత

జీరో దందా నిర్వహిస్తున్న వ్యాపారులు ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు ఎగవేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆటోమొబైల్, నిర్మాణ రంగంతో పాటు ఆహార ధాన్యాలు, పప్పు దినుసులు, వంట నూనె, మసాల దినుసులు తదితర వాటిల్లో కొందరు వ్యాపారులు అధిక లాభాపేక్షతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగవేస్తున్నారు. ఆయా వ్యాపారులు సంబంధిత అధికారులకు నెలసరి మామూళ్లు ముట్టజెప్పుడటంతో ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నట్లు స్థానికంగా చర్చ సాగుతోంది.

‘ఓటేద్దాం.. ఓటుశాతం పెంచుదాం’



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

కోల్‌సిటీ: ‘అందరం ఓటేద్దాం.. నియోజవర్గంలో ఓటుశాతాన్ని పెంచుదాం’ అంటూ గోదావరిఖనిలో కళాకారులు ఆట్టుకునేలా ప్రదర్శనలు నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం రిటర్నింగ్ ఆఫీసర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు ఆదివారం స్వీప్ ఆధ్వర్యంలో ఓటుహక్కు ప్రాధాన్యతపై గోదావరిఖనిలోని రమేశ్‌నగర్, కల్యాణ్‌నగర్, అడ్డగుంటపల్లి ప్రాంతాల్లో కళాకారులు పాటలు, నృత్యాలతో ఓటర్లకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధంలాంటిదని, 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ఓటుహక్కు ద్వారానే సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని అవగాహన కల్పించారు. కళాజాత బృందం కళాకారులు, ఆర్పీలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ పునరుద్ధరణ పనులు చేపడతాం

సాక్షి ఎఫెక్ట్

రామగుండం: జెన్‌కో ఉద్యోగుల క్వార్టర్లకు సరఫరా చేసే తాగునీరు పూర్తిగా కలుషితంగా వస్తున్న విషయాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తీసుకొచ్చింది. ‘ఉత్పత్తిపైనే ధ్యాస.. సంక్షేమం గాలికి!’ అనే శీర్షికతో శుక్రవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.విజేందర్ స్పందించారు. ఈ మేరకు తాగునీటి సరఫరా కలుషితమయ్యే క్వార్టర్లను గుర్తించి విద్యుత్ కేంద్రంలోని స్టోర్‌లో ఉన్న పైపులను వినియోగించి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయనున్నట్లు ఆయన ‘సాక్షి’కి తెలిపారు.


సాక్షి
ఉత్పత్తిపైనే ధ్యాస.. సంక్షేమం గాలికి!

సాక్షిలో ప్రచురితమైన కథనం



నిరుపయోగంగా ఎస్సారెస్పీ క్వార్టర్స్

సుల్తానాబాద్: పట్టణంలోని ఎస్సారెస్పీ సబ్ డివిజన్ కార్యాలయంలో ఉన్న క్వార్టర్స్ నిరుపయోగంగా ఉన్నాయి. గదులు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న క్వార్టర్లకు మరమ్మతు చేస్తే ఉపయోగంలోకి వస్తాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్వల్ప మరమ్మతు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారుల నివాసానికి ఉపయోగపడేలా క్వార్టర్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

గంజాయి స్వాధీనం

సుల్తానాబాద్‌రూరల్: స్థానిక కాల్వశ్రీరాంపూర్ చౌరస్తాలో ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గంజాయిల భించింది. ఎస్సై విజేందర్ కథనం ప్రకారం కాగజ్‌నగర్ ప్రాంతానికి చెందిన అదిత్యబజాజ్ అనే వ్యక్తి హైదారాబాద్‌లో ప్రైవేట్ కంపెనీ డీలర్‌గా పనిచేస్తున్నాడు. కాగజ్‌నగర్ ప్రాంతం నుంచి ఆదివారం హైదారాబాద్‌కు కారులో బయలుదేరి వెళ్తున్నాడు. దానిని కాల్వ శ్రీరాంపూర్ చౌరస్తాలో పోలీసులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా 100 గ్రాముల గంజాయి లభించింది. తనిఖీల్లో ఎస్సై వినీత, కానిస్టేబుల్ గణేశ్ పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో గృహిణి మృతి

జూలపల్లి: ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌తో గృహిణి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మండలంలోని పెద్దాపూర్‌లో చోటుచేసుకుంది. మృతురాలి భర్త వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దాడి లక్ష్మి(55) రాత్రి ఇంటి పనులు చేస్తుండగా ఇంట్లో ఉన్న కరెంటు వైరు తలకు తగడంతో షాక్‌కు గురై మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ పేర్కొన్నారు.



మరమ్మతు పనులు పూర్తిచేయండి

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని బస్‌స్టాండ్ ప్రవేశద్వారం వద్ద రోడ్డు శిథిలమైంది. వర్షం కురిసినప్పుడల్లా ప్రవేశద్వారం చెరువును తలపించేలా నీరు నిలుస్తోంది. ఆ ప్రాంతంలో మరమ్మతు చేపట్టేందుకు ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. దాదాపు రెండు నెలలుగా ప్రవేశద్వారాన్ని మూసి ఉంచారు. దీంతో బస్సుల రాకపోకలన్నీ ఒకే మార్గం ద్వారా జరుగుతుండడం ఇబ్బందిగా మారింది. వీలైనంత త్వరగా ప్రవేశద్వారం వద్ద మరమ్మతు పనులు పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు సత్యనారాయణస్వామి వ్రతం

రామగుండం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కోలహలం శ్రీనివాస్‌రావు తెలిపారు. వ్రతాలకు అవసరమయ్యే పూజా సామగ్రి, ప్రసాదం, అనంతరం భోజనం కమిటీ ఏర్పాటు చేయనుంది. వ్రతం చేసుకునే జంట రూ.800 కమిటీకి చెల్లించాల్సి ఉంటుంది. వివరాలకు సెల్ నంబర్‌ను 9949 465480ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

కోల్‌సిటీ: గోదావరిఖని రమేశ్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయంలో శనివారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పిల్ల ల వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీలత విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిల్లల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.